బీజేపీతోనే దేశాభ్యున్నతి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బర్కత్‌పురాలోని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారానే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని... భవిష్యత్‌లోనూ అదే పునరావృతం అవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రజలు ఆర్థికంగా, అభివృద్ధి చెందుందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధి కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. నరేంద్రమోదీ పాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పరిపాలన కొనసాగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జీ అభయ్ పాటిల్, పార్టీ నేతలు కృష్ణ యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, కృష్ణాగౌడ్, మేకల సారంగపాణి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ మహిళా నేతలు కె.గీతామూర్తి, బండారి రాధిక పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన సుభాష్

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తూ బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం ఎమ్మెల్యే కాలనీ లోని మంత్రి నివాసంలో టీ పీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ నేతృత్వంలో అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం కోసం పార్టీ నేతలు సమన్వయంతో పనిచేసి గెలిపించాలని మంత్రి సూచించారు. పార్టీ నేతలు హరినాథ్ రెడ్డి, ధర్మార్జున్ రెడ్డి, ఎం.మహేష్ యాదవ్, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ: బీజేపీ



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్

నల్లకుంట: తెలంగాణలో ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలు చేస్తున్నారో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పాలని నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పి రాహుల్‌గాంధీ తెలంగాణకు రావాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని, బీజేపీ దూకుడును ఇక ఎవరూ ఆపలేరన్నారు. వనం రమేష్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంటలో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించిన వనం కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చెప్పారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్ గౌడ్, నిఖిల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై మరిన్ని పరిశోధనలు అవసరం



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కోరి నాగార్జున

కాచిగూడ: ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కోరి నాగార్జున అన్నారు. ఆయుర్వేద వైద్యంలో పరిశోధనలు మరింత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతరించిపోతున్న సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురాలోని జీవశ్రీ ఆయుర్వేదలో 'రస ఔషధి'పై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయుర్వేద వైద్యులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయంగా ఆయుర్వేదాన్ని నేర్చుకోవడంతో పాటు దాన్ని విధిగా ప్రాక్టీస్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఏ వైద్యమైనా పూర్తిస్థాయిలో ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఆయుర్వేదంలో ఆరోగ్యంగా ఎలా ఉండాలనేది వివరించడంతో పాటు దానిని అనుసరిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సూచించారు. జీవశ్రీ ఆయుర్వేద ఎండీ డాక్టర్ ఫణిశ్రీ కొంటే, డాక్టర్ కల్పన, డాక్టర్ సత్యదీప, డాక్టర్ సునిత, డాక్టర్ సుభాషిణి, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆయుర్వేద వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరుకాపులకు సీట్లు ఇవ్వాలి



దామెరను అభినందిస్తున్న వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరుకాలపు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు ఇవ్వాలని తెలంగాణరాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు అన్నారు. మున్నూరుకాపు మహాసభ మాజీ అధ్యక్షుడు దామెర జ్ఞానేశ్వర్‌రావు శనివారం మహాసభ కార్యాలయానికి మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా దామెర జ్ఞానేశ్వర్‌ను మహాసభభ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మున్నూరుకాపులు పోటీ చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించి అభ్యర్థులను గెలపించుకునే విధంగా కృషి చేస్తామన్నారు. మహాసభ ప్రతినిధులు కొండూరు వినోద్ కుమార్, లింగిశెట్టి హనుమంతరావు, గూడెపు ప్రవీణ్, కైలాస్ అరుణ్ కుమార్, తోట భూమన్న, ఐలి శ్రీనివాస్, గంట శ్రీనివాస్, సిరిగిరి పవన్, కొత్తపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలను ఓట్లడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు'



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కవాడిగూడ: మాదిగలను ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని, మాలలను నెత్తిమీద పెట్టుకోవడం మాదిగలను పాదాల కింద అణచివేయడం కాంగ్రెస్ నైజం అని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానం కూడా కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగలను ఘోరంగా అవమానించడాన్ని నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్,ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సి.హెచ్.సోమశేఖర్‌మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకులు ఏర్పుల విష్ణు మాదిగ, జిల్లా నాయకులు అజిత్ వాల్మీకి, కిషన్ మాదిగ, శివమాదిగ, అరుణ్ మాదిగ, అనిల్ మాదిగ, రామకృష్ణ మాదిగ, రాజశేఖర్ మాదిగ, శ్యామ్‌సన్‌మాదిగ, ఆదిత్యమాదిగ, సుజాత, సరోజ, ప్రశాంత్ మాదిగ పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకోవాలి

- క్రీడాభివృద్ధికి మెరుగైన వసతులు కల్పిస్తాం
- అన్నివిభాగాల్లో క్రీడాకారులను ప్రోత్సహిస్తాం
- జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు



అంబర్‌పేటలో స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవంలో అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు

అంబర్‌పేట్: క్రీడలు, క్రీడాకారును అన్ని విధాలా ప్రోత్సహించేందుకు జీహెచ్‌ఎంసీ కృషి చేస్తున్నదని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు తెలిపారు. శనివారం అంబర్‌పేట్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్, వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ క్రీడా మైదానాల్లో వివిధ క్రీడాల్లో శిక్షణ పొందేలా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ క్రీడా మైదానలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, క్రీడా మైదానం కమిటీ ప్రతినిధులు జ్ఞానేశ్వర్‌గౌడ్, సద్గురు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష



లంబాడీ బస్తీలో అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛతను పాటిస్తేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 ఏఎంఓహెచ్ మైత్రి అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ బస్తీలో స్వచ్ఛత వైపు ఒక అడుగు పేరిట జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటిలో ఉండే తడి, పొడి చెత్తను రోడ్లపై వేయరాదని చెత్తను సేకరించడానికి వచ్చిన వారికి ఇవ్వాలని ఆమె సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలతో కొట్టుమిట్టాడుతూ అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్స్ గోవర్ధన్, చాణక్య, డీపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రెనింగ్ (సెల్ట్)లో ఇంటర్, పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో నెల రోజుల శిక్షణకు 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. నగరంలో వివిధ పాఠశాల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8.15 నిమిషాల నుంచి 9.45 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.నవీన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేటి నుంచి (7న) దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మద్దతు

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్

హిమాయత్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ ప్రకటించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేశ్వర్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లో 50 శాతానికి పైగా పెంచుతామని ప్రకటించడం హర్షణీయమన్నారు. దేశంలో కులగణన చేపడతామని మేనిఫెస్టోలో పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీసీలు అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని రాజేశ్వర్ యాదవ్ పిలుపునిచ్చారు. బీసీ నాయకులు రవికుమార్‌చారి, ఎం.కుమార్, పూసల సత్యనారాయణ,జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వం జారీ చేసిన వివిధ ఉద్యోగాలను సాధించేందుకు లైబ్రరీలో చదువుతున్నామని..కానీ ఇక్కడ వసతులు సరైన సరిగా లేవని వెంటనే సౌకర్యాలు కల్పించాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు విద్యార్థులు వినతి పత్రం సమర్పించారు. శనివారం ఓయూ లైబ్రరీని సందర్శించేందుకు వెళ్లిన రిజిస్ట్రార్‌కు ఏఐఎస్‌ఎఫ్, రీసెర్చ్ స్కాలర్స్ సమస్యలను వివరించారు. విద్యార్థులకు కూర్చునేందుకు కుర్చీలు లేవని ఖాళీగా ఉన్న గదుల్లో కుర్చీలు టేబుల్స్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నుంచి దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లి సత్య, లక్ష్మణ్, సోమనాథ్, సుమన్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

అతి పిన్న వయస్సు యోగా శిక్షకురాలు ఆర్యాహి

పంజగుట్ట: భారతదేశంలోనే అత్యంత చిన్న వయస్సు యోగా గురువుగా ముంబైకి చెందిన ఆర్యాహి గుర్తింపు పొందింది. కేవలం ఏడు సంవత్సరాల వయస్సులోనే యోగా గురువుగా శనివారం సోమాజిగూడలోని భోధీ యోగా ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక డైరెక్టర్ అశోక్ కుమార్ వంకినేని చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. వీరి ఇంట్లో ఆర్యాహి తల్లి దీప్తి అగర్వాల్, తండ్రి శరత్, సోదరుడు ఆతీక్ష్ అందరూ యోగా గురువులే కావడం విశేషం. ఆర్యాహితో పాటు ఖైరతాబాద్, ఆనంద్‌నగర్‌కు చెందిన ఎనిమిది సంవత్సరాల లావణ్య, పన్నెండు సంవత్సరాల మీరా రాజేలు కూడా యోగా గురువులుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరు 200 గంటలు యోగా శిక్షణ పూర్తిచేసి తరువాత నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులు అయిన తర్వాత వీరికి యోగా గురువు గుర్తింపు పత్రం ఇస్తామని అశోక్ కుమార్ తెలిపారు.

నరేంద్రమోదీ పాలనలోనే దేశాభివృద్ధి

ఎంపీ డాక్టర్ కోవా లక్ష్మణ్



చిక్కడపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరించిన ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ అన్నారు. చిక్కడపల్లి బూత్ నంబర్ 9లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీనగర్‌లో కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్‌తో కలసి ఆయన బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం సమగ్రాభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బూత్ కోర్డినేటర్ రత్నసాయిచంద్, బూత్ కోర్డినేటర్ శ్రీకాంత్, దామోదర్, విజయ్‌గౌడ్, పి.నర్సింగ్‌రావు, ఆకుల సురేందర్, ఎంపీ లక్ష్మణ్ తనయుడు కోవా రాహుల్, కాపువాడ శ్రీను, బూత్ అధ్యక్షుడు కార్తీక్, సాయి పాల్గొన్నారు.

బీజేపీకి అత్యధిక సీట్లు ఖాయం



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్థసారథి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పార్థసారథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.పార్థసారథి జోస్యం చెప్పారు. శనివారం చిక్కడపల్లిలో బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ... 1980లో రెండు లోక్‌సభ స్థానాలతో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ప్రస్తుతం దేశంలో రెండుమార్లు అధికారంలో వచ్చిందని గుర్తుచేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400 ఎంపీ సీట్లను సాధించడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని కైవలం చేసుకోవడానికి అందరు ఏకతాటిపై రావాలని కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్, సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, హర్షసూరి, జ్యోతి, మోహన్, రమ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

ముషీరాబాద్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వకముందే ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. ఆయా విద్యా సంస్థల గుర్తింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు బి.నరసింహరావు, కాపాటి పృథ్వీ, నరేందర్, సంధ్య, ఎర్ర అఖిల్, సురేష్, సీతారాం, వెంకటేష్, అజర్, అజయ్, అనిల్, సంధ్య, పవిత్ర, సతీష్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'తో బిల్ కలెక్టర్ల ఉద్యోగాలకు ముప్పు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అమలు వల్ల సుమారు 650 మంది విద్యుత్ బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో గృహజ్యోతితో ఉద్యోగాలు కోల్పోయిన బిల్ కలెక్టర్లు, ఈఆర్‌ఓ, డీఈ ఆఫీసులలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రమేష్ మాట్లాడారు. బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషనర్ ఇచ్చిన జీవో 11 ప్రకారం స్కేల్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థ యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు కృష్ణయ్య, లక్ష్మయ్య, రమేష్, రాజేశ్వరి, ఆశాలత, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం బాగ్ అంబర్‌పేట అయ్యప్ప ఆలయం వద్ద ధర్మశాస్త సేవా సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు స్ఫూర్తిని ఇస్తాయన్నారు. స్థానిక నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: బీజేపీ స్థాపన దివస్‌ను పురస్కరించుకొని శనివారం నల్లకుంట బూత్ నంబర్–5లో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ అమృత బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గ్రాడ్యుయేషన్ డే'



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, టీచర్స్

కాచిగూడ: చిట్టిపొట్టి చిన్నారులు ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణగూడ నారాయణ స్కూల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నారాయణ స్కూల్ జీఎం గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ... పిల్లలు పుట్టగానే తమ తల్లిదండ్రులు వారి పిల్లలు డాక్టర్, ఇంజినీర్లు కావాలనుకోకుండా వారి అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దితే వారు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తారని అన్నారు. పిల్లల అభిరుచికి తగినట్లుగా తల్లిదండ్రులు స్పందించి నైతిక విలువలను ఇంటి దగ్గర నుంచి నేర్పించాలని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలపరమేశ్వర్, ఆజాద్, భవాని, నూర్జహాన్, మహేశ్వరి, హర్‌నీత్ కౌర్, మోహీఉన్నీసా, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ 'టిఫిన్ బైఠక్'



హరినగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ

ముషీరాబాద్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో బూత్ కమిటీ కన్వీనర్, ఇతర సభ్యులతో కలిసి టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ బూత్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ పరిస్థితి, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం తదితర అంశాలపై చర్చించారు. రాంనగర్ డివిజన్ హరినగర్‌లోని 180 బూత్‌లో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ పార్టీ జెండాను ఆవిష్కరించి టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే అడిక్‌మెట్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రొయ్యూరు శేషసాయి తన బూత్ పరిధిలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని బీజేపీ సభ్యులతో కలిసి నిర్వహించారు.

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియం నుంచి తుక్కుగూడ కాంగ్రెస్ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, బి–బ్లాక్ ప్రెసిడెంట్ అంజి యాదవ్, పాశం అనిల్ యాదవ్, భాస్కర్, అభిషేక్, తిరుమల, సంగపాక వెంకట్, సురేష్ యాదవ్, దేవి వరప్రసాద్, శివ, నితిష్, అభిలాష్, బాబ్జీ, గుర్రం శంకర్ తదతరులు పాల్గొన్నారు.

22, 21వ తేదీల్లో సింగిడి-24 రాష్ట్రస్థాయి పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 20, 21 తేదీలలో రాష్ట్రీయ కళామంచ్–తెలంగాణ ఆధ్వర్యంలో సింగిడి–2024 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఏబీవీపీ నగర ప్రముఖ్ డాక్టర్ రామకృష్ణ, కార్యదర్శి పృథ్వీతేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలల విద్యార్థుల కోసం నిర్వహించే సింగిడి–2024లో శాస్త్రీయ నృత్యం (సోలో, గ్రూప్), జానపద (నృత్యం,పాటలు), ఏకపాత్రాభినయం, లఘు చిత్రం, యువ కవిసమ్మేళనం, డప్పు, శాస్త్రీయ గీతాలు, రంగోలి, శిల్పకళ, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, సంప్రదాయ వస్త్రాలంకరణ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ నేతలు తెలిపారు. ఏబీవీపీ నాయకులు శ్రీహరి, జీవన్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విశ్వప్రభ దేవి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కస్తూరి తిలకం, గురుబ్రహ్మ, గజానన, ఆంగికం భువనం, వినాయక కౌతం, కొలువైతివా, జతిస్వరం, కృష్ణంకలియసఖి, బ్రహ్మాంజలి, దశావతారం, రామాయణ శబ్దం, స్వర జతి అంశాలను కళాకారులు, విదిష, సాన్విక, యువిన, ప్రణవి, లక్ష్మీప్రియ, వసుధ, సంజన,రుచిక, సహస్ర మోక్ష ప్రదర్శించి మెప్పించారు.